నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 24 జనవరి 2025 | HYDERABAD

హౌసింగ్ బోర్డు భూములు కొంటున్నారా..జాగ్రత్త

కేపీహెచ్‌బీ కాలనీ: 'కేపీహెచ్‌బీ కాలనీలో హౌసింగ్ బోర్డు భూములను కొనుగోలు చేస్తున్నారా...తస్మాత్ జాగ్రత్త.. ఆయా ప్రాంతాల్లోని కొన్ని ప్లాట్లు రోడ్డు విస్తరణలో కోల్పోయే ప్రమాదం ఉంది. స్థలాల వేలం పాట పేరుతో హౌసింగ్‌బోర్డు ప్రజలను మోసం చేస్తున్నది.. అని కూకట్‌పల్లి మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. హౌసింగ్‌బోర్డు అధికారలు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని, మున్సిపల్ చట్టాలను, మాస్టర్ ప్లాన్‌లను పరిగణలోకి తీసుకోకుండా ప్లాట్లను అమ్ముకుని సొమ్ము చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయడం సిగ్గు చేటన్నారు. హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేస్ నుంచి గోపాల్‌నగర్ వైపు 200 ఫీట్ల రోడ్డుగా నిర్ణయించిందని, రోడ్డు పక్కన ఉన్న 146 గజాలు, 78 గజాల విస్తీర్ణం గల రెండు ప్లాట్లను 80 ఫీట్ల రోడ్డుగా చూపుతూ అమ్మకానికి పెట్టడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఆ రెండు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కొద్దిరోజుల్లోనే ఆ ప్లాట్లను రోడ్డు విస్తరణలో కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అధికారులు మాత్రం రోడ్డులో ప్లాట్లు పోతే... జీహెచ్‌ఎంసీ నుంచి నష్టపరిహారం కింద టీడీఆర్ ఇస్తారని చెబుతున్నారన్నారు. అలా చూసినా.. ప్లాట్‌ను కొన్న ధరకు...టీడీఆర్ ధరకు పోల్చితే పావు వంతు కూడా ధర రాదన్నారు. ఇలా ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా హౌసింగ్ బోర్డు వేలం పాటను వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ముందు ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యేలు వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, మాధవరం కృష్ణారావు, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, మహమూద్ అలీ, శంభీపూర్ రాజు తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి

బీఆర్ఎస్ పోరుబాట!

కమిషనర్ ఇలంబర్తిని కలిసిన ప్రజాప్రతినిధుల బృందం

సమస్యలపై వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యేలు

ఏడాది పాటు అభివృద్ధి కుంటుపడిందని ఆగ్రహం

సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరసన గళం విప్పింది. ఏడాదిలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజా సమస్యలు పెరిగిపోయాయని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లు, రవాణా ఆధారిత అభివృద్ధి తదితర ప్రాజెక్టులు చేపట్టి హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దితే ...అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను గాలికి వదిలేసిందని విమర్శించారు. వీధి దీపాల నిర్వహణ సరిగా లేదని, కొత్తగా వైకుంఠధామాలు, రోడ్డు కనెక్టివిటీ నిర్మాణాలు లేవని, పారిశుధ్యం పూర్తిగా గాడి తప్పిందన్నారు. కొందరు అధికారులు కనీస ప్రొటోకాల్ పాటించడం లేదని, ఫోన్లు బ్లాక్‌లో పెట్టడం, ఫోన్ ఎత్తకపోవడం, మరికొన్ని చోట్ల ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వడం లేదని తీవ్ర స్థాయిలో విరుచుపడ్డారు. ఏడాది పాటు సమయం ఇచ్చామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీఆర్ఎస్ కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సమస్యలపై గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల బృందం గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతిపత్రం సమర్పించింది. తలసాని నేతృత్వంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, మహమూద్ అలీ, శంభీపూర్ రాజు, కార్పొరేటర్ల బృందం కమిషనర్‌కు ప్రజా సమస్యలను వినతిపత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రజల పక్షాన నిరంతరం పోరాటం: ఎమ్మెల్యే తలసాని

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా అవసరాలను తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పన జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది పాటు సమయం ఇచ్చినా అభివృద్ధి విషయంలో తమ వైఖరి మార్చుకోవడం లేదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఇక మీదట గ్రేటర్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీఆర్ఎస్ పనిచేస్తుందని, ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. నియోజకవర్గాల వారీగా పేరుకుపోయిన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని, కచ్చితంగా వాటిని పరిష్కరించాలని, పరిష్కరించకపోతే తగిన కారణాలు చెప్పాలని తలసాని డిమాండ్ చేశారు. అన్నింటి కంటే ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంతో శంకుస్థాపన చేసి.. 10 నుంచి 20శాతం పనులు జరిగితే వాటిని రద్దు చేశారని మండిపడ్డారు. ఫత్తేనగర్ ఫ్లై ఓవర్ విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో అండర్‌పాస్ తదితర చోట్ల పనులను నిలిపివేశారని తలసాని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలన్నారు. సంఖ్యాపరంగా బలంగా ఉన్న బీఆర్ఎస్‌కు కౌన్సిల్‌లో ప్రశ్నలకు అవకాశం కల్పించకపోవడం సిగ్గుచేటని, కౌన్సిల్‌లో ప్రజా సమస్యలే ఎజెండా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఈ నెల 25న గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులంతా ప్రత్యేక సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని, అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని తలసాని డిమాండ్ చేశారు.

పనితీరు బాగా లేదు

కమిషనర్ ఇలంబర్తి తీరుపై
మేయర్‌తో పాటు సభ్యుల ఆగ్రహం

క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సరైన
ప్రతిపాదనలు వస్తాయని హితవు

13 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

సిటీబ్యూరో: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన 7వ స్టాండింగ్ కమిటీ సమావేశం హాట్ హాట్‌గా జరిగింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీ సభ్యులు కమిషనర్, అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కమిషనర్ ఇలంబర్తి పనితీరుపై మేయర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు డివిజన్లలో క్షేత్రస్థాయిలో మేయర్ పర్యటిస్తుంటే కమిషనర్ హాజరు కాకపోవడం ఏంటని ప్రశ్నించారు. కమిషనర్ నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతుంటేనే సరైన ప్రతిపాదనలు వస్తాయని మేయర్ హితవు పలికారు. బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు సైతం కమిషనర్ వ్యవహార శైలిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా వీధి దీపాల నిర్వహణపై సభ్యులంతా అసంతృప్తిని వ్యక్తం చేశారు. గడిచిన ఆరు నెలలుగా వీధి దీపాల నిర్వహణ బాగలేదని, ఎన్నిసార్లు చెప్పినా.. అధికారులు మాట వినడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆనంతరం స్టాండింగ్ కమిటీలో తొలి మూడు అంశాల్లో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ప్రాజెక్టు కింద ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికిగానూ మూడు జంక్షన్లలో 105 ఆస్తులకు సంబంధించి కమిటీలో చర్చ పెట్టారు. దీనిపై బీఆర్ఎస్ పార్టీ సభ్యులు ఆర్‌డీపీ ప్లాన్‌పై స్పష్టత లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరి ఆస్తులు ఎక్కడెక్కడ పోతున్నాయి? వారి వివరాలు సభ్యులు తెలియపర్చాలని డిమాండ్ చేశారు. ప్రముఖుల నివాసాలు, ఆస్తులకు సంబంధించి గోప్యత ఎందుకు పాటిస్తున్నారని, తొలుత వారి ఆస్తులను స్వాధీనం చేసుకున్నాకే మిగతా వారి జోలికి వెళ్లాలని, భూ సేకరణ లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. దీంతో కేబీఆర్ పార్కు ఫ్లై ఓవర్ ఆస్తుల సేకరణ ఆర్‌డీపీ ప్లాన్‌ను కమిటీ ఆమోదించలేదు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలివీ..

- గుల్మోహర్ పార్కు జంక్షన్ నుంచి తారానగర్ మీదుగా బీహెచ్ఈఎల్ జంక్షన్ వరకు, రైల్వే క్రాసింగ్ లింగంపల్లి నుంచి 1100 మీటర్ల పొడవు రోడ్డు విద్యానికేతన్ స్కూల్ నుంచి గుల్మోహర్ జంక్షన్ వరకు 30 మీటర్లు, 36 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ 227 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ చేసిన సిఫారసుకు కమిటీ ఆమోదించింది.
- ప్రభుత్వ ఉత్తరు మేరకు నేషనల్ హైవే 4పై జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు నిర్మించి ప్రారంభించిన ఆరు లేన్ల గ్రేడ్ సపరేటర్(ఫ్లై ఓవర్)కు డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎక్స్‌ప్రెస్ వేగా నామకరణం చేస్తూ కమిటీ ఆమోదించింది.
- కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం వద్ద ఫైబర్, సిమెంట్ కుండీలతో పూల మొక్కలతో గ్రీనరీ కోసం సీఎస్ఆర్ విధానంతో ఏర్పాటు చేసి నిర్వహణకు మెస్సర్స్ క్రియేటివ్ థాట్స్ మీడియా హైదరాబాద్ సంస్థకి మూడేండ్ల పాటు ఎంఒయూకు కమిటీ ఆమోదించింది.
- చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లలో 2025 సంవత్సరానికి ఆరు డీ సిల్టింగ్ పనులకు మొత్తం రూ. 2231.75 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే నాలా పూడిక తీత పనులకు పరిపాలన అనుమతితో పాటు టెండర్ నోటిఫికేషన్‌కు కమిటీ ఆమోదించింది.
- సీఆర్ఎంపీ ఫేస్-1 కింద చేపట్టిన పనులకు కొనసాగింపుగా సీఆర్ఎంపీ ఫేస్-2 కింద రూ. 744.22 కిలోమీటర్ల రోడ్డు నిర్వహణకు జోన్ వారీగా ప్యాకేజీలతో 2025 నుంచి 2030 కాలానికి ఐదు సంవత్సరాల పాటు రూ. 2491 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పనులకు నిబంధనల ప్రకారంగా బడ్జెట్ కేటాయింపు, రూ. 3828 కోట్లతో 1142 కిలోమీటర్ల మేర ఫేస్-2 పనుల టెండర్ అనుమతికి కమిటీ ఆమోదించింది.
- లాలాపేట ఫ్లై ఓవర్ నుంచి మౌలాలి ఫ్లై ఓవర్ వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణకు మంజూరైన రూ. 3కోట్లకు అదనంగా రూ.1.30 కోట్ల రివైజ్డ్ పరిపాలన అనుమతికి ఆమోదం.
- కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ హెచ్ సిటీ ప్రాజెక్టుకు ఆమోదం.
- నల్గొండ ఎక్స్‌రోడ్ నుంచి సైదాబాద్ వయా ఐఎస్ సదన్ మీదుగా ఒవైసీ వరకు ఫ్లై ఓవర్ రూ.620 కోట్ల అంచనా వ్యయానికి రాటిఫికేషన్‌కు కమిటీ ఆమోదం
- నారాయణగూడలో ఓల్డ్ మున్సిపల్ మార్కెట్ స్థలంలో మోడల్ భవన నిర్మాణంలో చేసిన మార్పులకు కమిటీ ఆమోదం తెలిపింది.
- టేబుల్ ఐటమ్స్‌లో భాగంగా ఎంజే మార్కెట్ నుంచి భూ లక్ష్మీ దేవాలయం (ముస్లిం జంగ్ బ్రిడ్జి) వయా మాలకుంట బేగం బజార్ రోడ్డు వరకు 30 మీటర్ల వెడల్పుతో అభివృద్ధి పనులకు కమిటీ ఆమోదించారు.
- ఎస్ఆర్‌డీపీలో భాగంగా గచ్చిబౌలి జంక్షన్ వద్ద రెండో లెవల్ కొండాపూర్ వైపు, ఓఆర్ఆర్ వైపు ఆరు లేన్ల టూ వే ఫ్లై ఓవర్ల నిర్మాణ, శిల్పా లే అవుట్ నుంచి గ్యాస్ కంపెనీ మీదుగా గచ్చిబౌలి జంక్షన్ వరకు 120 అడుగుల వెడల్పు రహదారి ఏర్పాటుకు కమిటీ ఆమోదించారు.
- రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద ప్రతిపాదించిన గోషామహల్ పోలీస్ గ్రౌండ్ వద్ద అప్రోచ్ రోడ్ నుంచి ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వరకు 9 మీటర్లు, 12 మీటర్లు, 18 మీటర్ల విస్తరణతో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి తదితరులు

కిడ్నీ రాకెట్‌లో పెద్ద తలకాయలు?

సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ర్టాల్లో కలకలం సృష్టించిన కిడ్నీ రాకెట్‌లో పెద్ద తలకాయలే ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే కేసును నీరుగార్చేందుకు కొన్ని అదృశ్య శక్తులు సర్వ ప్రయత్నాలు చేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. కిడ్నీ రాకెట్ వ్యవహారం బయటకు వచ్చి మూడు రోజులు గడిచినా.. ఈ కేసులో పురోగతి లేకపోవడం ఇందుకు బలం చేకూరుస్తున్నది.

నగరంలో పలు చోట్ల అలకనంద మూలాలు?

సాధారణంగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేయాలంటే సర్జరీకి ముందు వైద్యపరీక్షలు, ఇతరాత్ర పలు రకాల ప్రక్రియలు ఉంటాయి. అయితే కిడ్నీ మార్పిడికి అవసరమైన ప్రక్రియ మొత్తం 9పడకల సామర్థ్యం ఉన్న చిన్నపాటి దవాఖానలో సాధ్యం కాదంటున్నారు నిపుణులు. దీని కిడ్నీ మార్పిడికి సంబంధించిన వైద్యపరీక్షలు, ఇతర ప్రక్రియ మొత్తం నగరంలోని మరో చోట జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని ఆధారంగా అలకనంద మూలాలు నగరంలోని పలు చోట్ల ఉన్నట్లు విచారణాధికారులు అనుమానిస్తున్నట్లు సమాచారం.

తాళం వేసి విచారణకు ఆదేశించడమేంటి?

కిడ్నీ రాకెట్‌పై వైద్య, ఆరోగ్యశాఖ విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే జరిగిన వ్యవహారంపై విచారణ జరపాలంటే ముందుగా శస్త్రచికిత్సలు జరిగిన దవాఖాన, అక్కడున్న వసతులు, ఆపరేషన్ థియేటర్ తదితర కీలకమైన అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. కానీ కిడ్నీ మార్పిడీలు జరిగిన దవాఖానకు తాళం వేసి, గేటు బయట నుంచే విచారణ చేయించడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఇదిలా ఉండగా, దర్యాప్తు కమిటీ పలు అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది.

మధ్యాహ్నం వేడి..

రాత్రి చలి

సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో విభిన్నమైన వాతావరణం ఉంటోంది. రాత్రయ్యిందంటే విపరీతమైన చలి, చల్లని గాలులు వీస్తుండగా, మధ్యాహ్నం వచ్చే సరికి ఎండ తీవ్రత కనిపిస్తున్నది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగి, రాత్రి వేళల్లో గణనీయంగా తగ్గిపోతున్నది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గరిష్ఠం 30.6, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.2 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.

పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోను

చిత్తశుద్ధి ఉంటే ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులు

పాతబస్తీ నుంచి మొదలుపెట్టాలి

ఆక్రమణల కూల్చివేతలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం

హిమాయత్‌నగర్, జనవరి 23 : పేదల ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేస్తూ వారికి అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. గురువారం హైదర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దానం నాగేందర్ మాట్లాడుతూ ఆపరేషన్ రోప్ పేరుతో ఫుట్‌పాత్‌లపై ఉన్న చిరు వ్యాపారస్తుల దుకాణాలను తొలగించడంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'అధికారులే సుప్రీం అనుకుంటే ఏట్లా..అలా చేస్తే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు' అని అన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేతలు మొదలు పెట్టాలంటే ముందుగా ఓల్డ్ సిటీ నుంచి మొదలు పెట్టాలంటూ.. వ్యాఖ్యలు చేశారు. అధికారులు ఒక చోట పనిచేస్తూ బదిలీలతో మరోచోటుకు వెళ్తారని.. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా స్థానిక ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాలసీ ఉంటే ప్రజలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చేసే పనుల వల్ల ప్రజల్లో తాము తిరగలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పుట్టింది, పెరిగింది రాజకీయ జీవితాన్ని ఇచ్చింది హైదరాబాదేనని, ఖైరతాబాద్ నియోజకవర్గానికే పరిమితం తాను కాదని.. నగరంలో ప్రజలకు ఎక్కడ ఇబ్బంది వచ్చినా.. తాను ముందుటానని స్పష్టం చేశారు. పొట్టకూటి కోసం జీవనం సాగిస్తున్న పేదవారిపై దౌర్జన్యం చేయడం ఏంటని మండిపడ్డారు. మాదాపూర్‌లో ఫుట్‌పాత్‌పై కుమారి ఆంటీ పెట్టుకున్న క్యాంటీన్ విషయంలో ఇబ్బందిపెట్టినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి స్పందించి.. ఆమె జోలికి పోవద్దని అధికారులకు ఏ విధంగా ఆదేశాలు ఇచ్చారో ..ఫుట్ పాత్‌లపై చిరువ్యాపారం చేసుకునే పేదల దుకాణాల కూల్చివేతలు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. చెరువులను కాపాడేందుకు హైడ్రా పనిచేస్తున్నదని, మూసీ ప్రక్షాళన చేసి సుందరీకరణ చేయాలని ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పేద ప్రజల ఇండ్లు, షాపులు కూల్చివేయడం వల్ల నిత్యం ప్రజలు తన దగ్గరకు వస్తున్నారని, ప్రజల శాపనార్థాలు ప్రభుత్వానికి మంచిదికాదన్నారు.

రీ సర్వే చేయాల్సిందే..

దరఖాస్తుదారుల డిమాండ్లు

'గ్యారంటీల' లబ్ధిదారుల ఎంపిక తీరుపై తీవ్ర అసంతృప్తి

ఎంపిక ప్రక్రియలో అవకతవకలపై ఆగ్రహం

వివిధ పథకాలకు మళ్లీ వేల సంఖ్యలో అర్జీలు

మేడ్చల్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): గ్యారంటీల అమల్లో లబ్ధిదారుల ఎంపికపై రీ సర్వే చేయాల్సిందేనని దరఖాస్తుదారుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ లబ్ధిదారుల ఎంపికలో అనేక అవకతవకలు జరిగిన నేపథ్యంలో దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు చేయకుండా కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి మేరకే లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఆరోపిస్తూ మళ్లీ లబ్ధిదారుల ఎంపికపై రీ సర్వేను చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తుదారులు అధికారులను నిలదీస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపికపై అధికారుల తీరుపై నిరసనలు, నిలదీతలు జరిగాయి. ప్రభుత్వం నుంచి పథకాల ఎంపికపై స్పష్టత లేకపోవడంతో అధికారులకు తలనొప్పిగా మారింది.

లబ్ధిదారుల జాబితానా లేక..?

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న గ్రామ, వార్డు సభల్లో అధికారులు చదువుతుంది లబ్ధిదారుల ఎంపిక జాబితానా, దరఖాస్తుల జాబితానా అన్నది స్పష్టంగా అధికారులు దరఖాస్తుదారులకు చెప్పలేకపోతున్నారు. ఈ నెల 22న జరిగిన జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో స్వయంగా మంత్రులు గ్రామ, వార్డు సభల్లో చదివే జాబితా దరఖాస్తుదారులదేనని, లబ్ధిదారుల జాబితా కాదని, జాబితాలో పేర్లు లేని వారి నుంచి మళ్లీ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లకు మంత్రులు సూచించిన విషయం తెలిసిందే. ఈ విషయమై అధికారులు జరుగుతున్న గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తుదారులు ఇది లబ్ధిదారుల జాబితానా, దరఖాస్తుదారుల జాబితానా అని అధికారులను ప్రశ్నిస్తున్నా.. సరైన సమాధానాలు చెప్పలేకపోతున్నారు. దరఖాస్తుదారులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోతుండటంతో మరింత ఆగ్రహానికి గురవుతున్నారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లో నామ మాత్రంగా లబ్ధిదారులను ఎంపిక చేసి మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తుండటంతో పథకాల అమలును పొడగించేందుకే ప్రభుత్వం చేస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేలాది సంఖ్యలో దరఖాస్తులు

జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న గ్రామ, వార్డు సభల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం వేలాది సంఖ్యలో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

రాంచంద్రగూడ గ్రామ సభలో ఉద్రిక్తత

బడంగ్‌పేట: రామ చంద్రగూడ గ్రామంలో గురువారం నిర్వహించిన సభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు నిజమైన లబ్ధిదారులకు ఎందుకు రాలేదని బీఆర్ఎస్ మహేశ్వరం అధ్యక్షుడు రాజునాయక్, స్థానికులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ నేత కృష్ణ నాయక్ 'మా పాలన మా ఇష్టం.. మీరెవరు చెప్పడానికి' అని అనడంతో లొల్లి మొదలైంది. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలపై దాడికి యత్నించారు. దీంతో గ్రామసభ రణరంగంగా మారింది. 'ఇది బీఆర్ఎస్ పాలన కాదు.. కాంగ్రెస్ పాలనలో మా ఇష్టం వచ్చిన వాళ్లకే పథకాలు వస్తాయి..' అని బాహాటకంగానే కాంగ్రెస్ నాయకులు అనడంతో స్థానికులు ఒక్కసారిగా గ్రామ సభలో ఉన్న అధికారుల తీరుపై మండిపడ్డారు.ఇందిరమ్మ ఇండ్లు ఇల్లు ఉన్న వారికే ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదర్‌షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామసభ

ప్రభుత్వ స్కూళ్లలోనే గ్రామ సభలు

అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ, జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఇటీవల రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటి కోసం దరఖాస్తులు చేసుకున్న వారితో పాటు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా అధికారులు గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వీటిని వార్డు కార్యాలయంలో గాని ఇతర ఖాళీ స్థలాల్లో నిర్వహించాలి. కానీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులుగా కిస్మత్‌పూర్, పిరం చెరువు, హైదర్‌షాకోట్ ప్రభుత్వ పాఠశాలల్లోనే గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 'సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా మండల విద్యాధికారితో పాటు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు అనుమతులు తీసుకోవాలి. కానీ అధికారులు తమ ఇష్టారాజ్యంగా ప్రభుత్వ పాఠశాలలో టెంటు వేసి.. మైకులు పెట్టి విద్యార్థులకు ఆటంకం కలిగిస్తున్నారు. అదికూడా మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సభలు నిర్వహిస్తున్నారు. అని గండిపేట మండల విద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. కాగా, హైదర్‌షాకోట్‌లో జరిగిన గ్రామ సభలో మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత పాలనలో అవినీతి జరిగిందని చెప్పడంతో అక్కడే ఉన్న కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి 'ఎవరు చేశారు అవినీతి.. ఇప్పుడే బయట పెట్టాలి' అని చెప్పడంతో కొద్ది సేపు వాగ్వాదం జరిగింది.

కాంగ్రెస్ ప్రభుత్వానికి మతిమర్పు

తీసుకున్న దరఖాస్తులను.. ఎన్ని సార్లు తీసుకుంటారు

నిర్భంధాల మధ్య గ్రామ, వార్డు సభలు

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వానికి మతిమర్పు ఉందని, తీసుకున్న దరఖాస్తులను ఎన్నిసార్లు తీసుకుంటారని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకుస్థాపనలు చేసిన పనులను వీలైనంత త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో నిధులు కేటాయించడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్ మంజూరు చేసిన నిధులు ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.50కోట్లు, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు, జల్‌పల్లి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, తుక్కుగూడకు రూ.25 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసినా..వాటిని ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులతో ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు రుణ మాఫీ, రైతు బంధు ఇస్తామని చెప్పి తీసుకున్న దరఖాస్తులు బుట్టదాఖలు చేశారని ఎమ్మెల్యే అన్నారు. నిర్బంధాల మధ్య గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నారన్నారు.

మీర్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి